RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | సంపుటి : 3, సంచిక : 253 | ఆదివారం సెప్టెంబర్ 07, 2025 | పేజీలు : 4 | వెల : రూ.3-00



మెరుగైన వైద్య సేవలు అందించాలి

2లో..

# దేవాలయాల అభివృద్ధే ధ్యేయం


**రూ.4.35 కోట్ల వ్యయంతో దేవాలయాల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన మంత్రి కొండా సురేఖ**



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణతో ముందుకు సాగుతోందని రాష్ట్ర అటవీ, పర్యావరణ దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శనివారం మంత్రి కొండా సురేఖ వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ఆరు దేవాలయాలకు 4.35 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టే అభివృద్ధి పనులకు నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దేశాయిపేటలోని శ్రీ రంగనాథస్వామి ఆలయంలో స్వామి వారి జన్మదిన సందర్భంగా కోటి దీపాలను వెలిగించే కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ పాల్గొని ఒత్తులు వెలిగించారు. అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ మట్టెవాడ భోగేశ్వర స్వామి దేవాలయం, దేశాయిపేట రంగనాయక స్వామి దేవాలయం, కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయం, గోవిందరాజుల గుట్ట వద్ద ఆంజనేయ స్వామి దేవాలయం నిర్మాణం, కాశీ విశ్వేశ్వర రంగనాయక స్వామి దేవాలయం కాశిబుగ్గ, అబ్బని కుంట లోని మహేశ్వరి దేవాలయాల అభివృద్ధి నవీకరణ పనులకు నేడు శంకుస్థాపన చేశారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని ప్రతి దేవాలయాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారు. అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు సౌకర్యార్థంగా ఉండే విధంగా ప్రణాళికబద్దంగా ఆలయాల్లో నిర్మాణాలు చేపట్టాలని, ఆలయాలకు రంగులు వేసి కొత్తదనాన్ని తీసుకో రావాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు. తూర్పు నియోజకవర్గానికి 18 దేవాలయాల అభివృద్ధి పనులకు మంజూరు చేశామని,అందులో భాగంగా నేడు ఆరు దేవాలయాల అభివృద్ధి పనులను ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. మిగిలిన దేవాలయాల అభివృద్ధి పనులను త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు. దశలవారీగా అన్ని ఆలయాల అభివృద్ధి, నవీకరణ, పునరు ద్ధరణ చేయడతామని తెలిపారు.

కాతీయుల కాలం నాటి చారిత్రాత్మక దేవాలయాలు వరంగల్ లో అధికంగా ఉన్నందున వాటిని పునరుద్ధరణ చేసి భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. పురావస్తు, పర్యాటక శాఖలకు సంబంధించిన దేవాలయాలను కూడా అభివృద్ధి చేయుటకుగాను ఆయా శాఖల నుండి అనుమతి కొరకు జిల్లా కలెక్టర్ తగు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. పురావస్తు శాఖ వారి అనుమతి మంజూరైన తదుపరి ఆయా దేవాలయం అభివృద్ధి చేస్తామని, దేవదాయ శాఖకు సంబంధించిన అన్ని దేవాలయాలకు,



దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రిగా తాను నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు రామ తేజస్వి శిరీష్ ,కావేటి కవిత,చింతాకుల అనిల్ కుమార్, ఓని స్వర్ణలత, భాస్కర్,సోమిశెట్టి ప్రవీణ్ కుమార్ ఎండోమెంట్ అధికారి సునీత, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## వినాయక నిమజ్జన తీరును పరిశీలించిన మేయర్

**వేద న్యూస్, వరంగల్ :**

వినాయక నిమజ్జనం తీరును నగర మేయర్ గుండు సుధారాణి శనివారం చిన్న వడ్డేపల్లి చెరువు వద్ద క్షేత్రస్థాయిలో సందర్శించి నిమజ్జన తీరు ను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నిమజ్జన ప్రక్రియ భక్తులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా కొనసాగాలని శుక్రవారం నుండి పూర్తి స్థాయి లో నిమజ్జనం ప్రారంభం అయిందని అట్టి ప్రక్రియ కొనసాగుతుందని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండ క్రేన్లు అందుబాటులో ఉంచడమే కాకుండా విద్యుత్, లైట్ లు ఉండే విధంగా చర్యలు చేపట్టడం జరిగిందని నిమజ్జనం అయిపోయేవరకు అధికారులు క్షేత్రస్థాయిలోనే అందుబాటులో ఉండాలని ఈ సందర్భంగా మేయర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సురేష్ జోషి, కావేటి కవిత, బస్వరాజు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు

## సీఎంను తిట్టిన వ్యక్తిపై కేసు నమోదు..!



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

రాష్ట్ర ప్రభుత్వం నుంచి సరఫరా చేసిన యూరియా బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త మానుక లక్ష్మణ్ యాదవ్ మూడు సార్లు తీసుకెళ్లి ఇష్టారీతిన ఆరోపణలు చేయడం సరికాదని జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం ఒక ప్రకటనలో తెలిపారు.ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త మానుక లక్ష్మణ్ యాదవ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై అనుచిత వాఖ్యలు, వ్యక్తిగత దూషణలు చేశారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చెన్ని బాబు గురువారం ఎస్సై రాహుల్ రెడ్డికి ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. ఎల్లారెడ్డిపేట సింగిల్ విండో గోదాం వద్ద యూరియా కోసం వచ్చిన రైతుల సమక్షంలోనే అందరూ చూస్తుండగానే ఎల్లారెడ్డిపేట బీ ఆర్ఎస్ పార్టీ కార్యకర్త మానుక లక్ష్మణ్ యాదవ్ సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ తన కాలికి తొడిగిన చెప్పును ఎత్తి చూపుతూ వ్యక్తి గత దూషణలకు దిగాడని, అతడిపై విచారణ చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆయన చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు.ఆయన సీఎంను దూషించిన ఆడియో వీడియో రికార్డులను ఫోటోలను పోలీసులకు ఆయన అందజేశారని, ఎల్లారెడ్డిపేట పోలీసులు లక్ష్మణ్ యాదవ్ పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మానుక లక్ష్మణ్ యాదవ్ ఇప్పటికే మూడు సార్లు యూరియా తీసుకెళ్లారని జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం స్పష్టం చేశారు. యూరియా తీసుకెళ్తూ ఇలా ఆరోపణలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు చేయడం సరికాదని పేర్కొన్నారు.

## శభాష్.. పోలీస్



**– భక్తుని ప్రాణాలు కాపాడిన ఎస్సై శ్రవణ్, కానిస్టేబుల్ చందు**

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్:**



గ్రేటర్ వరంగల్ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉర్సు గుట్ట వద్ద గణేషుడి నిమజ్జనానికి వచ్చిన ఓ భక్తునికి ఫిడ్స్ రావడం తో మిల్స్ కాలనీ పోలీసులు అత్యవసర చికిత్స సేవలు అందించారు. స్థానిక భక్తులు తెలిపిన వివరాల ప్రకారం నిమజ్జనానికి వచ్చిన భక్తుడు ట్రాక్టర్ లో కూర్చుని వినాయకులను వీక్షిస్తుండగా ఒక్కసారిగా కాళ్లు చేతులు ఆడిస్తూ నురగ కక్కాడు. దీంతో అక్కడే విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ చందు గమనించి తన భుజాల పై మోసుకొని వెళ్లి అత్యవసర చికిత్స చేశారు. భక్తుడు మేల్కోవడంతో తోటి భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. సాహసోపేతంగా విధినిర్వహణ చేసి భక్తుడిని కాపాడిన మిల్స్ కాలనీ ఎస్సై శ్రవణ్, కానిస్టేబుల్ చందులను స్థానిక భక్తులు అధికారులు అభినందించారు.

## దేవేందర్‌రెడ్డికి బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డు

- ఆదిత్య మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఎండీగా చక్కటి సేవలు
- అవార్డు ప్రదానం చేసిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, అతిథులు



**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట ఆదిత్య మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్(ఎండీ) ఎలుక దేవేందర్‌రెడ్డి బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర పరిధిలో బిజినెస్‌లో కీలకంగా రాణించిన 50 మంది బిజినెస్ మాన్స్‌ను రాజ్ న్యూస్ చైర్ పర్సన్ లక్ష్మీ రావు తమ సర్వే ద్వారా ఎంచుకొని అవార్డు అందజేశారు. ఈ అవార్డు గ్రహీతల్లో ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎలుక

మిగతా 3వ పేజీలో..

## నీట్ కౌన్సిలింగ్ వచ్చే వారంలో ప్రారంభం..!

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**



ఇటీవల సుప్రీంకోర్టులో జీవో 33 అనుకూలంగా తీర్పు వెలువడిన నేపథ్యంలో నీట్ పేరెంట్స్ అసోసియేషన్ ఆరోగ్యశాఖ మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నీట్ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు సత్యనారాయణ చారి కార్యదర్శి పొడిశెట్టి రమేష్ కుమార్, నియాజ్ అలిగేటి అశోక్ మహిపాల్ రెడ్డి రాజేందర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ స్థానిక విద్యార్థుల ప్రయోజనం కోసం 2024 సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన జీవో 33 అమలుకు అన్ని అడ్డంకులు తొలగిపోవడంతో రాష్ట్రంలోని విద్యార్థులు వారి తల్లిదండ్రులు హర్షాతిరేకలు వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఆరోగ్య మంత్రికి శాలువాతో సత్కరించి పుష్పగుచ్చాన్ని అందించారు వీరిని ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ మెడికల్ సీట్లతో తెలంగాణ స్థానిక విద్యార్థులకు ఎలాంటి నష్టం కలిగితే మా ప్రభుత్వం

మిగతా 3వ పేజీలో..

## హైదరాబాద్‌లో డ్రగ్స్ ఫ్యాక్టరీ సీజ్

**వేద న్యూస్ డెస్క్:**



హైదరాబాద్ కేంద్రంగా భారీగా డ్రగ్స్ దందా కొనసాగుతోంది అనడానికి ఈ ఫ్యాక్టరీనే ఉదాహరణ. వేల కోట్ల రూపాయాల్లో డ్రగ్స్ దందా చేస్తున్నట్లు తేలింది. బంగ్లాదేశ్‌కు చెందిన డ్రగ్స్‌తో మహారాష్ట్ర పోలీసులకు పట్టుబడడంతో..

మిగతా 3వ పేజీలో..

# పంతులుపల్లి పాఠశాలలో ఘనంగా గురుపూజోత్సవం



**వేద న్యూస్, నల్లబెల్లి :**

నల్లబెల్లి మండలం నాగరాజు పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పంతులుపల్లి ప్రాథమిక పాఠశాలలో గురుపూజోత్సవ కార్యక్రమం ఎంతో ఘనంగా జరిగింది. నాగరాజు పల్లి, మామిండ్ల వీరయ్య పల్లి గ్రామాల మాజీ సర్పంచులు గోనే శ్రీదేవి, ఆసం చంద్రమౌళి ఆధ్వర్యంలో పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సందర్భంగా వారు మాట్లాడుతూ పంతులుపల్లి పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల యొక్క కృషిని అంకిత భావాన్ని అభినందించారు. విద్యార్థులు లేక మూతబడి పోయే ప్రమాద స్థితిలో ఉన్న పాఠశాలను ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఇంటింటికి తిరిగి, గ్రామస్తులను ఒప్పించి ప్రైవేట్ స్కూళ్లకి వెళ్లే విద్యార్థులను కూడా తమ పాఠశాలకు రప్పించుకుని విద్యార్థులు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. మున్ముందు ఇంకా మంచి పేరు తెచ్చుకొని మండలంలోని పలు పాఠశాలలకు ఆదర్శవంతంగా తయారు చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కర్ణకంటి రామ్మూర్తి, ఉపాధ్యాయుడు కూనమల్ల రాజన్ బాబు, మామిండ్ల వీరయ్య పల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు అమ్మోజు రాము గార్లను పూలమాలతో సత్కరించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఎరుకల వెంకటలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు నేతునూరి సుమలత, బైరి రమ, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్య సేవలు అందించాలి

**వేద న్యూస్, హన్మకొండ:**

హనుమకొండ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ అప్పయ్య అయిన వోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ంలో జరుగుతున్నటువంటి అవు ట్ రీచ్ వ్యాక్సినేషన్ మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సం దర్శించి సేవల గురించి తెలుసు కోవడం జరిగింది. వాక్సినేషన్ కార్యక్రమ తీరు, సింగారం వంటిమామిడి పల్లెలో గ్రామా లలో జరుగుతున్న వ్యాక్సినేషన్, సామ్ ,మామ పిల్లల వివరాలుఏన్ సి రిజిస్ట్రేషన్ ,మరియు



ఫీవర్ సర్వే డ్రై డే , టిబి ముక్త భారత్ అభియాన్ కార్యక్రమాల గురించి తెలుసుకొని పలు సూచనలు చేయడం జరిగింది.వాక్సినేషన్ డ్యూ లిస్టు లో సింగారం గ్రామంలో నలుగురు ఉండగా ముగ్గురు వ్యాక్సినేషన్ వేసుకోవడం జరిగింది. ఒంటిమామిడి పల్లెలో ముగ్గురికి గాను ఒకరు వాక్సినేషన్ తీసుకోవడం జరిగినది. ఈ వారం మిస్ అయిన వారిని వచ్చే బుధవారం రోజున తప్పనిసరిగా వాక్సినేషన్ కార్యక్రమానికి వచ్చే విధంగా తెలియజేయాలని తెలిపారు. వీరితోపాటుగా పల్లె దవఖాన వైద్యాధికారి డాక్టర్ సరిత,ఎంపీఎచ్ ఈ ఓ శ్రీనివాస్ ,హెల్త్ సూపర్వైజర్ శ్రీనివాస్ , హెల్త్ అసిస్టెంట్లు సరిత, ఫాసిద్దేనే ,అంగన్వా టీచర్ లక్ష్మి, ఆశా కార్యకర్తలు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పది

**వేద న్యూస్,ధర్మసాగర్:**




ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గల "టీచింగ్ లెర్నింగ్ సెంటర్ లో" "ధర్మసాగర్ మండల విద్యాధికారి డాక్టర్ రామ్ దాన్ అధ్యక్షతన ధర్మసాగర్ జిల్లా పరిషత్ బాలుర పాఠశాల కాంప్లెక్స్ ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు ,ధర్మ ప్రకాష్ సమన్వయకర్తగా నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ధర్మసాగర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి అనిల్ కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రస్తుతం ఉపాధ్యాయులు చాలా సంక్లిష్ట పరిస్థితుల్లో తమ విద్యా సేవలను అందిస్తున్నారు. నిత్యం బోధనపరంగా ఎన్నెన్నో సవాలను ఎదుర్కొంటున్నారు. విద్యార్థుల శ్రేయస్సు ముఖ్యంగా ,సమాజ ప్రగతిలో భాగస్వాములు అవుతున్నారని అన్నారు. ధర్మసాగర్ మండలంలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న 17 మంది ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించి అవార్డులు ఇచ్చారు. సీనియర్ తెలుగు ఉపాధ్యాయులు ఉమాదేవి వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ధర్మసాగర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థుల బృంద స్వాగత నృత్యం ఆహుతులందరినీ అలరించినది. ఉపాధ్యాయులు సునంద ,శైలజ, సురేష్ ,ఇన్నారెడ్డి ,యాస్మిన్, సత్యనారాయణ, ,సునీత, శ్యాంసుందర్ రెడ్డి, బాపురావు, రాజు, హిమబిందు,రగోతం రెడ్డి ,పూల్ సింగ్, అనిల్ సురేష్ ,పద్మలు అవార్డులు పొందిన వారిలో ఉన్నారు. అవార్డు ఉత్సవం విజయవంతం చేయడంలో ధర్మసాగర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు వాలంటీర్లుగా సేవలందించారు. అలాగే ఆ పాఠశాల ఉపాధ్యాయులు సురేష్, పద్మజ, ప్రసన్న ,రమ్యశ్రీ లతో కూడిన లాజిస్టిక్ కమిటీ విశేష సేవలందించారు.

# నిర్మాణ రంగ కార్మికులకు ఎక్స్‌గ్రేషియా పెంపు

**వేద న్యూస్, శాయంపేట:**

నిర్మాణరంగ కార్మికుల ఎక్స్ గ్రేషియా పెంపు వలన రాష్ట్రంలో పదిహేను లక్షల మంది వర్కర్లకు ఉపయోగ ఉంటుందని ఐ ఎన్ టి యు సి మండల అధ్యక్షుడు మారపల్లి రాజేందర్ తెలిపారు.మండల అధ్యక్షుడు మారపల్లి రాజేందర్ మాట్లాడుతూ యాక్సిడెంటల్ డెత్ ఎక్స్‌గ్రేషియా ఆరు లక్షల నుంచి పది లక్షలకు,సహజ మరణానికి లక్ష ముప్పై వేల నుంచి రెండు లక్షలకు ప్రభుత్వం పెంచింది అన్నారు. దీనివలన భవన నిర్మాణ కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నరు అన్నారు. భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులకు ఇచ్చే ఎక్స్‌గ్రేషియా పెంచేందుకు ప్రభుత్వం నిర్ణయించింది అన్నారు .ఇందులో భాగంగా యాక్సిడెంటల్ డెత్ ఎక్స్‌గ్రేషియాను రూ పది లక్షలకు, సహజ మరణానికి ఇచ్చే సాయాన్ని రూ రెండు లక్షలకు పెంచుతున్నట్లు కార్మిక శాఖ ప్రకటించింది అన్నారు .వివిధ నిర్మాణ పనులు చేస్తున్న వారు ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోతే వారి కుటుంబాలకు అండగా నిలిచేందుకు ఈ ఆర్థిక సాయాన్ని అందించనుంది. ఎక్స్‌గ్రేషియా పెంచాలని గత సర్కార్ హయాంలో ఎన్నో సార్లు ఆందోళనలు చేసినా పట్టించుకోలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పరిహారాన్ని పెంచడం పట్ల కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు అన్నారు. వీరితో పాటు వెల్డర్లు, వాచ్‌మన్లు, టన్నెల్‌వర్కర్స్, బావి పూడిక తీసేవాళ్లు, మార్బుల్, టైల్స్ వర్కర్లు, రాళ్లు కొట్టేవాళ్లు, రోడ్డు నిర్మాణ కార్మికులు, పంపు ఆపరేటర్స్, మున్సిపల్ డ్రైనేజీ వర్కర్స్, మిక్సర్ డ్రైవర్లు, మెకానిక్, ల్యాండ్ స్కేపింగ్ వర్కర్స్ తదితర యాభై నాలుగు రకాల కేటగిరీల కార్మికులు ఉన్నారు. వీళ్లలో అరవై ఏండ్ల లోపు ఉండి లేబర్‌కార్డు కలిగిన వారందరికీ ఈ బీమా వర్తించనుంది అన్నారు. వీటితో పాటు భవన నిర్మాణ కార్మికుల కూతురి పెండ్లికి రూ ముప్పై వేలు, వర్కర్ భార్యకు లేదా కూతురు ప్రసూతికి రూ ముప్పై వేలు, ప్రమాదవశాత్తు గాయపడి ఇక పనిచేయలేని పరిస్థితి ఏర్పడితే రూ నాలుగు లక్షలు, పూర్తిగా వికలాంగులైతే రూ ఐదు లక్షలు అనగా భవన నిర్మాణ కార్మికుల యాక్సిడెంటల్ డెత్, సహజ మరణానికి సంబంధించిన ఎక్స్‌గ్రేషియా పెంపుపై కార్మికులు కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.గత ప్రభుత్వ హయాంలో అనేక సార్లు ఆందోళనలు చేసినా పట్టించుకోలేదని, ప్రస్తుతం కాంగ్రెస్ సర్కార్ ఎక్స్‌గ్రేషియాను పెంచడం ఆనందంగా ఉందన్నారు.

రిజిస్ట్రేషన్‌కు అర్హతలివే తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు కింద సభ్యులుగా పద్దెనిమిది ఏండ్ల నుంచి యాభై తొమ్మిది ఏళ్ల మధ్య వయస్సు గల నిర్మాణరంగ కార్మికులు మాత్రమే అర్హులు



అన్నారు.వీరు ఏడాదిలో కనీసం తొంబై రోజులు నిర్మాణ రంగంలో పనిచేసిన అనుభవం ఉండాలి అన్నారు.రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, వయస్సు నిర్ధారణకు రుజువుగా స్కూల్ సర్టిఫికేట్ లేదా డాక్టర్ సర్టిఫికెట్‌ను సమర్పించి మెంబర్ షిప్ సంబంధిత అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌కు అందజేసి లేబర్ కార్డును పొందొచ్చు అన్నారు . లేబర్ కార్డు పొందిన ఐదేళ్ల తర్వాత రెన్యూవల్ చేసుకోవాలి అన్నారు. ప్రభుత్వం నిర్మాణరంగ కార్మికు లకు ఎక్స్ గ్రేషియా పెంచడం పట్ల ఐ ఎన్ టి యు సి మండల అధ్యక్షుడు మారపల్లి రాజేందర్ హర్షం వ్యక్తం చేశారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని

# యువకుడికి తీవ్ర గాయాలు



**వేద న్యూస్, వీర్నపల్లి:**

వీర్నపల్లి గ్రామ శివారులోని ప్రమాదకార మూల మలుపు వద్ద శనివారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదకర మూల మలుపు వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడికి తీవ్రగా యాలైన ఘటన వీర్నపల్లి మండలం కంచర్లలో చోటుచేసుకుంది. ప్రతిరోజు మాదిరిగానే వేముల వాడ మైనార్టీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేయడానికి వెళుతున్న వీర్నపల్లి గ్రామానికి చెందిన భూత వినోద్ గౌడ్ ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో తలకు తీవ్ర గాయలయ్యాయి. గాయాలతో ఉన్న వినోద్ ను అంబులెన్స్ లో ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రుడిని పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని పలువురు వైద్యులకు సూచించారు.

# ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**వేద న్యూస్,ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలోని వాణి నికేతన్ హైస్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల ఆవరణలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ తూముకుంట్ల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదన్నారు. భవిష్యత్తు తరాలను నిర్మించే వారే ఉపాధ్యాయులు అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనిధి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సంతోష్, రమేష్, రాజు, తిరుపతి, రాజు, సుమంగళి, శోభ, రేఖ, మహాలక్ష్మి, లావణ్య, సునంద, కళ్యాణి, షమీమా, జలజ, శాంత, పద్మ, రేణుక, సునీత, స్వాతి, మౌనిక, రేణుకలతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆసుపత్రికి అంబులెన్స్ అందజేత




**వేద న్యూస్, వేములవాడ:**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తన సొంత నిధులతో వేములవాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి అంబులెన్స్ ను అందించారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ వెహికల్ ఇంఛార్జీ సాంబాయిపల్లి శ్రీనివాసరెడ్డి ఈరోజు ఆ అంబులెన్స్ తోపాటు వాటికి సంబంధించిన పత్రాలను వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రి అధికారులకు అందజేశారు. వేములవాడ నియోజకవర్గంలో రోగులకు అత్యవసర సేవలు అందించేందుకు ఈ అంబులెన్స్ ఎంతగానో ఉపయోగపడనుంది. బండి సంజయ్ గతంలోనూ వేములవాడసహా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రులకు పెద్ద ఎత్తున వైద్య పరికరాలను అందించారు. గతంలో తన పుట్టినరోజు సందర్భంగా సొంత ఖర్చులతో వివిధ ప్రభుత్వ ఆసుపత్రులకు రూ.3 కోట్ల విలువ గల వైద్య పరికరాలను అందించారు. కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి పెద్ద ఎత్తున మెడికల్ ఎక్విప్ మెంట్లను అందించారు. కరోనా సమయంలోనూ వేలాదిమందికి రెమిడిసివర్ ఇంజక్షన్లను, పీపీఈ కిట్లను అందజేసి ప్రాణం పోశారు. బీజేపీ సురక్షా పేరిట వేలాది మందికి ఉచితంగా కాన్సంట్రేటర్స్, రక్త దానం చేశారు. త్వరలోనే కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ బిలిటీ (సీఎస్సార్) కింద దాదాపు రూ.5 కోట్ల విలువైన వైద్య పరికరాలను అందించేందుకు ప్రతిపాదనలను కూడా సిద్ధం చేశారు. అతి త్వరలోనే ఆయా పరికరాలను వేములవాడసహా పలు ప్రభుత్వ ఆసుపత్రులకు అందించనున్నారు.

### నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తేనే

## భవన నిర్మాణ అనుమతులు



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తేనే భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేస్తామని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. శనివారం అక్యూపెన్సీ సర్టిఫికెట్ జారీ కోసం నగర పరిధి లోని బాలసముద్రం వడ్డేపల్లి సుబేదారి శాయంపేట ప్రాంతాలలో కమిషనర్ క్షేత్రస్థాయిలో సందర్శించి సమర్పించిన ధ్రువపత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భవన నిర్మాణాల అనుమతుల కోసం దరఖాస్తు చేసుకునే క్రమం లో వాస్తవ సమాచారాన్ని సూచించిన ధృవ పత్రాలను జత చేయడమే కాకుండా క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించే క్రమంలో సర్టిఫికెట్ లు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఏసిపి లు రజిత, ఎర్షాద్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రూ.3లక్షల 60 వేలకు లడ్డూ వేలం



**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 45 అడుగుల భారీ విగ్రహన్ని ఎల్లమ్మ బజార్ లో ఆకుతోట సంజీవ్ ఏర్పాటు చేశారు. ఈ 45 అడుగుల భారీ విగ్రహం వద్ద 45 కిలోల గణపతి లడ్డూను వేలం పాట వేయగా రూ.3లక్షల 60 వేలకు రమేష్ దంపతులు దక్కించుకున్నారు.

## నీట్ కౌన్సిలింగ్ వచ్చే వారంలో ప్రారంభం..!

ఊరుకోదని ఆ ఉద్దేశంతోనే ఎన్ని అడ్డంకులు వచ్చినా దానిని అధిగమించి స్థానిక విద్యార్థులు కు మేలు జరిగే ఉద్దేశంతో ఈ జీవో 33 అమలు జరిపామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం లో నీట్ పేరెంట్స్ అసోసియేషన్అధ్యక్షులు సత్యనారాయణ చారీ మాట్లాతూ ఈఒక మంచి లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన జీవో 33 అమలులో ఎన్నో అడ్డంకులు ఎదురైనాయి. దీనిని అమలు కాకుండా ప్రభుత్వ వ్యతిరేక శక్తులు న్యాయస్థానాలను ఆశ్రయించి ఎన్నో అడ్డంకులు సృష్టించాయి. వీటన్నింటిని అధిగమించి ప్రభుత్వానికి అనుకూలంగా సుప్రీంకోర్టులో తుది తీర్పు వెలువడింది అన్నారు. జీవో 33 అమలు కోసం నీట్ పేరెంట్స్ అసోసియేషన్ కూడా ఎంతో పోరాడామని. ఎన్నోసార్లు ప్రభుత్వ పెద్దలకు వినతి పత్రాలు సమర్పించామని. మంత్రులను అధికారులను కలిసి జీవో 33 అమలు ఆవశ్యకతను వివరిస్తూ విజ్ఞప్తులు చేశామని అన్నారు. ఈ విషయం లో ప్రభుత్వం చాలా సమర్ధవంతం వ్యవహరించి అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్ట్ లో తీర్పుకు సహకరించ్చిందని అన్నారు.

## హైదరాబాద్‌లో డ్రగ్స్ ఫ్యాక్టరీ సీజ్

ఆమెను విచారించగా ఈ డ్రగ్స్ తయారీ యూనిట్ వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్ కేంద్రంగా ఈ ఫ్యాక్టరీ నుంచి ఇప్పటికే కొన్ని వేల కోట్ల డ్రగ్స్ బిజినెస్ జరిగినట్లు తెలుస్తుంది. తాజాగా జరిపిన దాడుల్లో రూ. 12 వేల కోట్ల విలువైన డ్రగ్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని, ఆ ఫ్యాక్టరీని సీజ్ చేశారు. మేడ్చల్ జిల్లాలో డ్రగ్స్ తయారీ యూనిట్ గుట్టురట్టు అయింది. డ్రగ్స్ తయారీ యూనిట్‌పై మహారాష్ట్ర క్రైమ్ బ్రాంచ్ పోలీసులు దాడి చేశారు. ఎండీ డ్రగ్స్ తయారీలో వినియోగించే 32 వేల లీటర్ల ముడి సరుకును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మిథైలెనెడియాక్సీ, మెథాంఫెటమైన్ వంటి ముడి పదార్థాలను సీజ్ చేశారు. ఈ ఫ్యాక్టరీలో తయారైన డ్రగ్స్ వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తేలింది. దేశంతో పాటు విదేశాలకు కూడా ఎండీ డ్రగ్స్‌ను సరఫరా చేసినట్లు గుర్తించారు. ఎక్స్‌టాసీ, మోలీ, ఎక్స్‌టీసీ పేర్లతో డ్రగ్స్‌ను నిందితులు సరఫరా చేస్తున్నారు. డ్రగ్స్ తయారీ యూనిటక్‌కు చెందిన 13 మందిని అరెస్టు చేశారు. ఈ ముఠా నుంచి సుమారు రూ. 12,000 కోట్ల విలువైన నిషేధిత మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. గత నెలలో మహారాష్ట్ర పోలీసులకు బంగ్లాదేశ్‌కు చెందిన ఫాతిమా డ్రగ్స్‌తో పట్టుబడింది. ఆమె నుంచి రూ. 25 లక్షల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆమె ఇచ్చిన సమాచారంతో మహారాష్ట్ర క్రైమ్ బ్రాంచ్ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. పక్కా సమాచారంతో ఇవాళ మేడ్చల్‌లో దాడులు చేసి.. భారీగా డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.

# మహిళా సాధికారికతపై 10 రోజుల శిక్షణ ప్రారంభం

**వేద న్యూస్, సిరిసిల్ల:**



సిరిసిల్ల చిన్న బోనాల లోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగం గా పి లక్ష్మీరాజు జిల్లా సంక్షేమ అధికారి మహిళా శిశు సంక్షేమ శాఖ టోల్ ఫ్రీ నెంబర్ ల గురించి వివరించారు. మహిళల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన అనేక పథకాల గురించి వివరించారు. ఉచిత బస్సు సౌకర్యము ఉచి త విద్యుత్ సౌకర్యము, సబ్సిడీ వంటగ్యాస్ సౌకర్యము, షి టీములు, వడ్డీ లేని రుణాలు ఇందిరమ్మ ఇండ్లు,రేషన్ కార్డులు,ఇందిరమ్మ క్యాంటీన్లు ఆర్టీసీ అద్దె బస్సులు పెట్రోల్ పంపులు ఇలాంటి అన్ని రకాల నూతన స్కీముల గురించి వివరించారు. అలాగే జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ జా ఆదేశాల మేరకు గుడ్ టచ్ బాడ్ టచ్ సేఫ్ టచ్, అండ్ ఆన్ సేఫ్ టచ్ గురించి వివరించారు. అలాగే డిజిటల్ టెక్నాలజీ కొంతమంది చేస్తున్న దుర్వినియోగం వల్ల కలుగుతున్న దుష్పరిణామాలు దుష్ప్రభావాల గురించి వివరించారు. వాటి నుంచి ఎలా కాపాడుకోవాలో తెలియజేసారు. మహిళా సాధికారికత కేంద్రం కోఆర్డినేటర్ బిరోజా మాట్లాడుతూ పిల్లలకి వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. అలాగే మెన్ స్ట్రువల్ హైజీన్ గురించి వివరించి వారికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటించాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ తెరిసా, కేజీబీవీ సిరిసిల్ల ఎస్ఓ పావని మరియు సిబ్బంది పాల్గొన్నారు.ప్రభుత్వ మరియు ప్రైవేటు సంస్థలు అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేయాలి.మిషన్ శక్తి సంకల్పలో పది రోజుల అవగాహన కార్యక్రమంలో ఈరోజు పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నివారణ చట్టం 2013 గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. సిరిసిల్లలోని ట్రెండ్స్ షోరూం నందు మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది జనరల్ స్పెషలిస్ట్ దేవిక మాట్లాడుతూ పదిమంది పనిచేస్తున్న ప్రదేశంలో తప్పనిసరిగా అంతర్గత ఫిర్యాదులు కమిటీని ఏర్పాటు తెలియజెశారు, కార్యాలయానికి 50,000 రూపాయల జరిమానా కూడా విధించబ డుతుంది. పని ప్రదేశాల్లో మహిళలు సురక్షితంగా మరియు స్వేచ్ఛగా పని వాతావరణము అనేది ఉండాలని అందుకోసం అంతర్గత ఫిర్యాదుల కమిటీలు పనిచేస్తాయని తెలపారు.ఎవరైనా వారి పని చేస్తున్న ప్రదేశంలో ఇబ్బందులు ఎదుర్కొన్నట్లయితే అంతర్గత ఫిర్యాదుల కమిటీలో ఫిర్యాదు చేయాలని మహిళలకు సంబంధించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసినటువంటి 181 టోల్ ఫ్రీ నెంబర్ ని ఉపయోగించుకోవచ్చు అని తెలిపారు.

# క్రీడా పోటీలను పకడ్బందీగా నిర్వహించాలి



### – రాష్ట్ర మంత్రి అడ్డూరి లక్ష్మణ్ కుమార్

**వేద న్యూస్, కొనరావుపేట:**

ఈ.ఎం.ఆర్.ఎస్. క్రీడా పోటీలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్డూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.శనివారం రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్డూరి లక్ష్మణ్ కుమార్ కొనరావుపేట మండలం మర్రిమడ్ల నందు గల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ లో 5వ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ సెలక్షన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ విప్పు ఆది శ్రీనివాస్ , జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ లతో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్డూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ మంత్రి స్థాయిలో నేడు కొనరావు పేట మండలంలో జరుగుతున్న ఈఎంఆర్ఎస్ క్రీడా పోటీలకు రావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. తక్కువ సమయంలో క్రీడ పోటీల నిర్వహణకు మంచి ఏర్పాటు చేసిన అధికారులను సిబ్బందిని మంత్రి అభినందించారు. రాష్ట్ర నలుమూలల నుంచి నేడు 1200 మంది పైగా విద్యార్థులకు క్రీడా పోటీలు జరుగుతున్నాయని అన్నారు . ఇండోర్ ఔట్ డోర్ క్రీడా పోటీలను ప్రణాళిక ప్రకారం పక్కగా నిర్వహించాలని అన్నారు.పిల్లలకు ఎక్కడ ఇబ్బంది కలగకుండా క్రీడా పోటీలు నిర్వహించాలని అన్నారు. నిబంధనలు ప్రకారం పోటీలు నిర్వహించాలని అన్నారు. ఏకలవ్య పాఠశాలలకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని , తాను బాధ్యతలు తీసుకున్న తర్వాత 740 కోట్ల రూపాయలు గిరిజన గ్రామ పంచాయతీలకు విడుదల చేశామని అన్నారు. ప్రభుత్వ విప్ కోరిక మేరకు గిరిజన ప్రాంతాలకు రోడ్ల నిర్మాణానికి అదనంగా 10 కోట్లు రూపాయలు తప్పనిసరిగా మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పేదలకు మంచి విద్యార్థి అందించాలని లక్ష్యంతో గురుకులాలను ప్రభుత్వం నిర్వహిస్తుందని అన్నారు. గురుకుల లో చదివిన విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదుగుతున్నారని, అనేకమంది కలెక్టర్, ఎస్పీ లాయర్లు డాక్టర్లు ఇంజనీర్లు వంటి గొప్ప స్థానాలకు ఎదిగారని అన్నారు.

దేశం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం సూచన ప్రకారం పిల్లలంతా కళలు కన్ని వాటిని సాకారం చేసుకోవాలని అన్నారు. తల్లిదండ్రులు మనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని, గురుకులాలో ఉపాధ్యాయులు చెప్పే మాటలు పాటించాలని అన్నారు. చిన్నారులలో ఉన్న సృజనాత్మకతను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. ఎవరెస్ట్ శిఖరం అధిరోహించిన మాలావత్ పూర్ణ మాట్లాడుతూ గురువుల పాఠశాలలో చదువుకున్న తాను ఎవరెస్ట్ శిఖరం అధిరోహించడం జరిగిందని అన్నారు. మనం ఎటువంటి పరిస్థితుల్లో ఉన్నా మనం నిర్దేశించుకున్న మంచి లక్ష్యం సాధన కోసం కృషి చేస్తే సమాజం మొత్తం మనకు సహకారం అందిస్తుందని అన్నారు.లక్ష్యం దిశగా మొదటి అడుగు వేయడం చాలా కీలకమని అన్నారు. మనం ఏదైనా సాధించాలి అనుకుంటే కంఫర్ట్ జోన్ నుంచి బయటకు రావాలని అన్నారు. అనంతరం మంత్రి , విప్, జిల్లా కలెక్టర్ లను స్కూల్ యాజమాన్యం సన్మానం చేశారు. కబడ్డీ క్రీడ పోటీలను మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రాజు వేములవాడ ఏఎస్పి శేషాద్రిని రెడ్డి, ఆర్డిఓ రాధా బాయి , విద్యార్థిని విద్యార్థులు ప్రిన్సిపాల్ లు, పి ఈ టి లు, సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మల్టీ స్కిల్స్ పై శిక్షణ

**వేద న్యూస్, వరంగల్:**



మామునూర్ పోలీస్ శిక్షణ కళాశాలలో ఏక్ భారత్– శ్రేష్ఠ భారత్– 12రోజుల క్యాంపులో భాగంగా 5వ రోజు క్యాంపు కమాండెంట్ కల్నల్ సచిన్ అన్నారావ్ నిమ్బాల్కర్, వీరు చక్ర ఆధ్వర్యంలో జాతీయ సమైక్యత శిబిరం కొనసాగుతున్నది. శనివారం బెంగళూరు నుంచి వచ్చిన ఎక్స్ పో శిక్షణ అధికారులు ఉదయం నుంచి సాయంకాలం వరకు మల్టీ స్కిల్స్ పై 9 బృందాలుగా స్టాండ్ పోస్టుల్లో థియరీ పార్ట్, ఆసక్తికరమైన గ్రూప్ డిస్కషన్ ,వృత్తి సంబంధమైన ప్రయోగాలు చేస్తూ.. క్యాడేట్స్ కు లైఫ్ స్కిల్స్ ఎంతో ఉపయోగపడే విధంగా వ్యక్తిగతంగా, సమైక్య స్ఫూర్తి నింపే విధంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్టు ఎన్సిసి 10వ తెలంగాణ బెటాలియన్ వరంగల్ గ్రూప్ క్యాంపు డిప్యూటీ కమాండెట్ కల్నల్ ఎస్ ఎస్ రామదురై తెలిపారు. జాతీయ సమైక్యత శిబిరంలో మూడు రాష్ట్రాల నుండి 600 మంది క్యా డేట్స్ పాల్గొన్నారు. బీహార్, జార?ండ్, తెలంగాణ రాష్ట్రం నుండి వీరు పాల్గొంటున్నట్లు.. జాతీయ సమైక్యత కోసం ఒక ప్రాంతం మరొకరు గౌరవించడం, ఇక్కడి వంటకాలు ఆహార అలవాట్ల గ్రామీణ నేపథ్యం లో ఆహారాలవాట్లు వాటి రుచులు చూస్తున్నట్టు వెల్లడించారు. బీహార్, జార?ండ్ వాళ్లకు ఈ ప్రాంత వంటకాలతో భోజనాలు ఏర్పాటు చేశారు. ప్రముఖ చారిత్రక ప్రదేశాలు ఓరుగల్లు నగరాన్ని బీహార్ క్యాడేట్స్ సందర్శించారు. దేశ సమైక్యతకు ఈ క్యాంపు ఎంతో దోహదపడుతుందని డిప్యూటీ క్యాంపు కమాండెంట్ కల్నల్ ఎస్ఎస్ రామదురై స్పష్టం చేశారు. శిక్షణ అధికారిగా లెఫ్టినెంట్ కల్నల్ రవి సునరే, క్యాంపు అడ్జెంట్ కెప్టెన్ డాక్టర్ ఎం సదానందం, భువనేష్ కె హెచ్ , ప్రశాంత్ నాయుడు, బాయ్ రవి, చైతన్య, థామస్, దిశా లతికర సాహెబ్ ,ఎస్ఎం. జై రామ్ సింగ్, సూపర్ ఇండెంట్ అరుణ, జె సి ఓ ఖదం, సౌరస్య, సుతార్, సందీప్ పవర్, జయరాం,బిహెచ్ఎం సందీప్, నికేష్, దీపక్, ఉమేష్ ,ప్రవీణ్, గణేష్ ,దశరథం, కుమారస్వామి, సాజిని, దత్తు సతీష్ ,మహేష్, సంధ్య, కాత్యాయని, సంతోషి, రవి ,నిఖిలేష్, దీపక్,రచన, కల్పనా సింగ్,అపురుప ,సరిత, కావ్య, సుధా , గణేష్, అంజి, కమల్ కిషోర్, ట్రైనింగ్ అధికారులు, తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ ,బీహార్, జార?ండ్ 600 క్యాడేట్స్ పాల్గొన్నారు.

# దేవేందర్‌రెడ్డికి బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డు

దేవేందర్ రెడ్డి ఉన్నారు. ఆయనకు హైదరాబాద్ హైటెక్ సిటీలోని నోవోటేల్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ..తనకు లభించిన ఈ బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డు నిజంగా గొప్ప గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. ఈ అవార్డుతో తన బాధ్యతలు మరింతగా పెరిగాయని వెల్లడించారు. ఈ అవార్డుకి కారణమైన మిత్రులు, బంధువులు, ఆదిత్య ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, శ్రేయోభిలాషులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. జమ్మికుంట పట్టణ, పరిసర, ప్రాంత ప్రజలకు 'ఆదిత్య' ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తూ.. జనం కోసం చక్కటి సేవలు అందిస్తున్న ఆస్పత్రి యాజమాన్యానికి అవార్డు రావడం పట్ల పలువురు సంతోషం వ్యక్తం చేశారు.

వేద న్యూస్

ఆదివారం సెప్టెంబర్ 07, 2025

# సంపాదకీయం

## అజారామరాలు...
## ఉషశ్రీ పురాణ వ్యాఖ్యానాలు

తెలుగు వారికి పరిచయం అక్కర్లేని పేరు ఉషశ్రీ. తెలుగునాట ప్రఖ్యాతి గాంచిన రేడియో వ్యాఖ్యాతగా, సాహిత్య రచయితగా, తమ రామాయణ భారత ప్రవచనాల ద్వారా తెలుగుసీమలో ఉషశ్రీ అందరికీ సుపరిచితులు. అప్పట్లో ఆయన గొంతుని, మాట సరళిని గుర్తు పట్టలేని తెలుగు శ్రోతలు లేరంటే అది అతిశయోక్తి కానేకాదు. ధర్మ సందేహాలు అనే పదబంధం వినబడితే ఉషశ్రీ గుర్తుకు రాక మానరు. ఆకాశవాణి ద్వారా ఆ కార్యక్రమాన్ని అంతగా ప్రాచుర్యం గావించారు ఉషశ్రీ. పురాణ ప్రవచనంలోనే కాక ప్రత్యక్ష వ్యాఖ్యానాల లోనూ తెలుగు శ్రోతలపై చెరగని ముద్ర వేసిన 'గళగంధర్వుడు' ఉషశ్రీ. తెలుగు దేశంలో రేడియో స్వర్ణయుగ వైభవాన్ని శిఖరస్థాయికి చేర్చిన దిగ్దంతులలో అగ్ర తాంబూలం ఆయనదే అనడం అతిశయోక్తికాదు. ఉషశ్రీ (మార్చి 16, 1928 – సెప్టెంబరు 7, 1990) అసలు పేరు పురాణపండ సూర్యప్రకాశ దీక్షితులు. ఈయన పశ్చిమ గోదావరి జిల్లా కాకరపర్రు అగ్రహారంలో 1928 (ప్రభవ తెలుగు సంవత్సరం) సంవత్సరం మార్చి 16 (ఫాల్గుణ బహుళ త్రయోదశి) న జన్మించారు. తండ్రి ఆయుర్వేద వైద్యులు పురాణపండ రామూర్తి, తల్లి కాశీ అన్నపూర్ణ. వారికి నలుగురు సంతానం. డాక్టర్ గాయత్రి, పద్మావతి, వైజయంతి, కళ్యాణి.జాతీయోద్యమ సమయంలో కాకినాడలో కాంగ్రెస్ పార్టీకి ప్రతినిధిగా పని చేశారు. ఉభయ గోదావరి జిల్లాల్లో అనేక వేదికల ద్వారా రామాయణం, మహాభారతం మహాభాగవతం ప్రవచనం చేశారు. ఆకాశవాణిలో పని చేస్తున్నప్పుడు భారత, రామాయణ, భాగవతాలను ప్రతి వారం సీరియల్‌గా చెపుతూ, అశేష తెలుగు శ్రోతలను ఉర్రూత లూగించారు. పురాణాలను పుక్కిట పట్టిన సాహితీ ద్రష్ట. రామాయణ భారతాలు పనికిమాలిన గ్రంథాలు అని నిరసించే హేతు వాదులనూ, అవి పరమ పవిత్రమయిన మత గ్రంథాలు అని గుడ్డిగా ఆరాధించే చాందసులను ఇద్దరినీ సమానంగా నిందించి, ఈ రామాయణ భారతాలు మానవజాతి సర్వకాలాల లోనూ సుఖశాంతులతో మనుగడ సాధించడానికి అవసరమయిన విశేషాలను అందించే గ్రంథాలు మాత్రమే అనీ, అందుచేతనే ఇవి ఇన్నివేల సంవత్సరాలు జీవించ గలిగాయనీ ఉషశ్రీ స్పష్టం చేశారు. రేడియోలో ఉషశ్రీగా పేరొందక ముందు కవిత్వం, గేయాలు, యక్షగానాలు, ఎన్నో కథలు, నవలికలు రాసారు. ఎమెస్కో వారు కూడా ఎన్నో ప్రచురించారు. రేడియోలో వార్తలు కూడా చెప్పేవారు. రేడియో నాటకాలు రాసేవారు. రేడియో నాటకాల్లో పాల్గొనేవారు. 1973 లో రేడియోలో భారత ప్రవచనం ప్రారంభించాడు. ఉషశ్రీ పురాణ ప్రవచనాలు వారానికి ఒకసారి ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు వచ్చేది. అప్పట్లో, దూరదర్శన్ లేదు. ఉషశ్రీ పురాణ ప్రవచనాలు వారానికి ఒకసారి ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు వచ్చేది. ఆయన ఉచ్చారణ ఎంత గంభీరమో, రచనా శైలి కూడా అంతటి నారికేళపాకంగా ఉండేది. శ్రోతలు రేడియోల ముందు నుండి కదలక ఉండేవారు. భగవద్గీతను, సుందరాకాండను పండిత పామరులను అలరించేలా, అందరికీ అర్థమయ్యేలా చేశారాయన. ధర్మసందేహాల కార్యక్రమం రేడియోలో వస్తుంటే పండిత పామరులనే బేధాల్లేకుండా రేడియోకి అతుక్కుని పోయేవారు. అయన కార్యక్రమం ప్రారంభం అయినంటే, రిక్షా కార్మికులు మొదలుకొని, రోడ్లపై నడిచేవారు కూడా ఆగి, రేడియో ఉన్న షాపు వద్ద విని వెళ్ళేవారు. రోడ్లపై జనసంచారం ఉండేది కాదు. నేటి క్రికెట్ మాచ్ కి మించిన ప్రజాదరణ పొందిన కార్యక్రమం అది. మొదట శనివారం నాడు పది నిమిషాల కార్యక్రమంగా మొదలై తరువాత శ్రోతల కోరికపై అరగంట, ఆ తర్వాత ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు మార్చక తప్పలేదు. ఉషశ్రీ వాణి, ప్రత్యేకమైన బాణీ శ్రోతల్ని యెంతగా ఉర్రూత లూగించేవంటే వ్యాసపీఠం ప్రసారాల్ని నిలిపి వేసినప్పుడు రెడియో స్టషన్ యెదుట ధర్నాలు కూడా జరిగేవి. ఉషశ్రీ స్వరానికి వున్న పాపులారిటీకి అది మచ్చు తునక. దీన్ని బట్టి ఆయన కార్యక్రమాలు శ్రోతలను ఎంతగా ప్రభావితం చేశాయో స్పష్టం అవుతున్నది. 1979 లో పి.వి.ఆర్.కె ప్రసాద్ తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా ఉన్నపుడు ఉషశ్రీ చేత భాగవతం రాయించి పాతికవేల ప్రతులు ముద్రింప జేసి అతి తక్కువ ధరలో భక్తులకు అందించారు. అయితే ఆయన రెండున్నర రూపాయలకు విక్రయించే చర్యలు గైకొనగా, తర్వాత వచ్చిన అధికారులు తొమ్మిది రూపాయలకు పెంచారు. భారతం, రామాయణాలు కూడా పదివేల ప్రతులు ముద్రించి కృష్ణా పుష్కరాల సమయంలో విడుదల చేశారు. దైవభక్తి, దేవుడిమీద అచంచల విశ్వాసం, జాలి, దయ, కరుణ, సున్నితత్వం, సేవా దృక్పథం, ఆపదలో ఉన్నవారికి సాయం చేయడం ఆయన స్వభావం. ఆయన తనకు మాత్రమే తెల్సి ఇంకెవ్వరికీ చెప్పకుండా చేసిన సాయాలు, దానాలెన్నో. మానవ విలువలు, సంబంధాలకు ఎంతో విలువ నిచ్చేవారు. 1986–90ల మధ్య ఆంధ్రజ్యోతి, స్వాతి వారపత్రికలలో ఉషశ్రీ పాఠకుల ధర్మసందేహాలకు సమాధానాలు కార్యక్రమం నిర్వహించారు. వీరకాకాని అంతిమ యాత్ర, భారత మాజీ రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ ప్రారంభించిన రాజమండ్రి – కొవ్వూరు మధ్య గోదావరి నదిపై నిర్మించిన రోడ్ – కమ్ రైలు వంతెన ప్రారంభోత్సవం, భద్రాద్రి రామయ్య కల్యాణం, కృష్ణా పుష్కరాల సందర్భంగా తొలి ప్రత్యక్ష వ్యాఖ్యానం లాల్ బహదూర్ శాస్త్రి హైదరాబాద్ పర్యటన సందర్భంగా చేసిన ప్రత్యక్ష వ్యాఖ్యానం, తదితరాలు ఆయన వాగ్ధాటి, సమయస్ఫూర్తి, విషయ పరిజ్ఞానం, సమయోచిత సందర్భానుసార పద ప్రయోగ ప్రతిభకు నిదర్శనంగా నిలిచాయి. రాజాజీ ప్రసంగాలను అనువదించారు.

# టాటా కార్లపై రూ. 1.55 లక్షల వరకు తగ్గింపు

**వేద న్యూస్ డెస్క్:**



తాజాగా ప్రభుత్వం ప్రకటించిన జీఎస్టీ 2.0 రేట్ల తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు బదిలీ చేస్తూ ప్రముఖ వాహన తయారీ సంస్థ టాటా మోటార్స్ శుక్రవారం తన వాహనాలపై భారీ తగ్గింపు వివరాలను ప్రకటించింది. ప్యాసింజర్ వాహనాల ధరలను రూ. 75,000 నుంచి రూ. 1.55 లక్షల వరకు తగ్గించినట్టు తెలిపింది. కొత్త ధరలు సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. కంపెనీ అధికారిక వివరాల ప్రకారం, టాటా చిన్న కార్లలో టియాగో మోడల్‌పై రూ. 75 వేలు, టిగోర్‌పై రూ. 80 వేలు, ఆల్ట్రోజ్‌పై రూ. 1.10 లక్షలు తగ్గించింది. కాంపాక్ట్ ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో పంచ్ కారుపై రూ. 85 వేలు, నెక్సాన్‌పై రూ. 1.55 లక్షలు తగ్గించింది. మిడ్–సైజ్ ఎస్‌యూవీలలో కర్వ్‌పై రూ. 65 వేలు, ప్రీమియం ఎస్‌యూవీ విభాగంలో హారియర్‌పై రూ. 1.40 లక్షలు, సఫారీపై రూ. 1.45 లక్షలు తగ్గించింది. జీఎస్టీ సంస్కరణల ప్రయోజనాలను పూర్తిగా వినియోగదారులకు బదిలీ చేస్తామని టాటా మోటార్స్ ప్యాసింజర్ విభాగం ఎండీ శైలేష్ చంద్ర వెల్లడించారు.

# ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్‌గా ఎలాన్ మస్క్..?

**వేద న్యూస్ డెస్క్:**

ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కొన్నేళ్లలో మరో ఘనత సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎలక్ట్రిక్ కార్ల సంస్థ టెస్లా అనుకున్న లక్ష్యాలకు చేరుకుంటే ప్రతిపాదిత ప్రోత్సాహక ప్యాకేజీ కింద సంస్థ సీఈవోగా ఆయనకు భారీ మొత్తం సమకూరనుంది. దీంతో ఆయన సంపద భారీగా పెరగనుంది. దీంతో ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్‌గా చరిత్ర సృష్టించే అవకాశం ఉంది. ప్రపంచంలో అత్యంత సంపన్నుల జాబితాలో ఎలాన్ మస్క్ ఇప్పటికే తొలి స్థానంలో ఉన్నారు. ఎలోన్ మస్క్ కు టెస్లా భారీ ఆఫర్ ఇచ్చింది. బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం, అమెరికన్ కంపెనీ టెస్లా తదుపరి జజూా గా కొనసాగడానికి, కంపెనీని కొత్త శిఖరాలకు తీసుకెళ్లడానికి ఎలోన్ మస్క్ కు ఇచ్చిన జీతం ఆఫర్ విలువ 1 ట్రిలియన్ డాలర్లు (సుమారు రూ.83,00,000 కోట్లు) అని చెబుతారు. ఇప్పటివరకు చరిత్రలో ఇదే అతిపెద్ద జజూా జీతం ప్యాకేజీ అవుతుందట. ఈ ఆఫర్ 10 సంవత్సరాలకు అందించింది. కానీ ఈ భారీ మొత్తాన్ని మస్క్‌కు ఒకేసారి ఇవ్వరు. దీని కోసం అతను టెస్లా అనేక రంగాలలో గొప్ప విజయాన్ని సాధించేలా చేయాలి. ముఖ్యంగా కంపెనీ కొత్త "రోబోటాక్సీ" వ్యాపారాన్ని వేగంగా విస్తరించాలి. కంపెనీ మార్కెట్ విలువను నేటి దాదాపు 1 ట్రిలియన్ డాలర్ల నుండి కనీసం 8.5 ట్రిలియన్ డాలర్లకు పెంచాలి. ఈ ప్రణాళిక ప్రకారం, మస్క్ అన్ని లక్ష్యాలను సాధిస్తే అతను మిలియన్ల కొద్దీ టెస్లా షేర్లను పొందుతాడు. దీని వలన కంపెనీలో అతని వాటా 25% కి పెరుగుతుంది. భవిష్యత్తులో కంపెనీ దిశపై బలమైన నియంత్రణను కొనసాగించగలగడానికి టెస్లాలో తనకు అలాంటి వాటా కావాలని ఎలోన్ మస్క్ ఇప్పటికే బహిరంగంగా ప్రకటించాడు. ఈ జీతం ఆఫర్‌ను అతని 2018 ప్యాకేజీతో పోల్చి చూస్తే అది దాదాపు వి50 బిలియన్లు (సుమారు 4 లక్షల కోట్లు). దీనిని ఇటీవల కోర్టు తిరస్కరించింది. కానీ టెస్లా బోర్డు ఇప్పుడు మస్క్‌ను కొత్త, మరింత ప్రభావవంతమైన మార్గాల్లో కంపెనీకి అనుబంధంగా ఉంచడానికి ప్రయత్నిస్తోంది. ప్రత్యేకత ఏమిటంటే ఈ ప్రతిపాదనలో మస్క్ కంపెనీ భవిష్యత్ జజూా ని ప్లాన్ చేయడంలో చురుకైన పాత్ర పోషించాల్సిన షరతు కూడా ఉంది. ఈ ప్యాకేజీలో చివరి భాగాన్ని పొందడానికి అంటే మస్క్ డబ్బు సంపాదించడానికి మాత్రమే కాకుండా కంపెనీ తదుపరి తరాన్ని సిద్ధం చేయడానికి కూడా దోహదపడాలి.

# యుఎస్ ఓపెన్ ఫైనల్‌కు సబలెంక, అనిసిమోవా

**వేద న్యూస్ డెస్క్:**



నేడు పురుషుల సింగిల్స్ సెమీఫైనల్స్ న్యూయార్క్: యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్ ఫైనల్లోకి డిఫెండింగ్ ఛాంపియన్, టాప్ సీడ్ అర్యానా సబలెంక (బెలా రస్), అమందా అనిసిమోవా (అమెరికా) ప్రవేశించారు. శుక్రవారం జరిగిన మూడుసెట్ల హోరాహోరీ పోరులో వీరిద్దరూ ప్రత్యర్థులను చిత్తుచేశారు. తొలి సెమీస్‌లో అమెరికాకు చెందిన 8వ సీడ్ అనిసిమోవా 7–6(7–4), 6–7(3–7), 6–3తో 23వ సీడ్, జపాన్‌కు చెందిన నవోమి ఒసాకాను ఓడించింది. రెండో సెమీస్‌లో సబలెంక 4–6, 6–3, 6–4తో 4వ సీడ్, అమెరికాకు చెందిన జెస్సికా పెగూలాను చిత్తుచేసింది. శనివారం జరిగే టైటిల్ పోరులో సబలెంక అమెరికాకు చెందిన అనిసిమోవాతో తలపడనుంది. 27ఏళ్ల సబలెంక 2024లో ఈ టైటిల్‌ను తొలిసారి కైవసం చేసుకుంది. వీరిద్దరూ ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫైనల్లో తలపడడం ఇదే తొలిసారి. టాప్‌సీడ్ సబలెంక ఈ ఏడాది జరిగిన ఫ్రెంచ్ ఓపెన్ రన్నరప్ కాగా.. వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీస్‌లో ఓటమిపాలైంది. 2024లో ఆస్ట్రేలియన్ ఓపెన్, యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిళ్లను చేజిక్కించుకుంది. ఇక పురుషుల డబుల్స్‌లో యూకీ బాంబ్రీ పోరాటానికి సెమీస్‌లో బ్రేక్ పడింది. 14వ సీడ్‌గా బరిలోకి గిన బాంబ్రీ(భారత్)–ఎం. వీనస్(ఆస్ట్రేలియా) జంట శుక్రవారం జరిగి సెమీస్‌లో 7–6(7–2), 6–7(5–7), 4–6తో బ్రిటన్ జంట చేతిలో ఓటమిపాలైంది. ఇక పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో 7వ సీడ్, సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్‌తో 2వ సీడ్, స్పెయిన్ యువ సంచలనం కార్లోస్ అల్కరాజ్ తలపడనున్నాడు. రెండో సెమీస్‌లో టాప్‌సీడ్, ఇటలీకి చెందిన జెనిక్ సిన్నర్‌తో 25వ సీడ్, అగర్ అలియాస్సిమ్(కెనడా) పోటీపడనున్నాడు.

# భారత్ శుభారంభం

**వేద న్యూస్ డెస్క్:**

థాయ్ లాండ్‌పై 11–0తో గెలుపు – ఆసియాకప్ మహిళల హాకీ హాంగ్జూ(చైనా): ఆసియాకప్ మహిళల హాకీలో భారత్ శుభారంభం చేసింది. శుక్రవారం జరిగిన పూల్–బి తొలి లీగ్ మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 11–0తో థాయ్ లాండ్‌ను చిత్తుచేసింది.ఉదిత దుహాన్, బ్యూటీ డంగ్ డంగ్ రెండేసి గోల్స్‌తో సత్తా చాటారు. ఉదిత 30, 52వ ని.లో గోల్స్ చేయగా.. బ్యూటీ 45, 54వ ని.లో గోల్స్ చేశారు. ముంతాజ్(7వ ని.), సంగీత(10వ ని.), నవ్‌నీత్ కౌర్(16వ ని.), లాల్‌రిమిసిమి(18వ ని.), సుమన్ దేవి(49వ ని.), షర్మిల(57వ ని.), రుతుజ ధండోస్(60వ ని.) ఒక్కో గోల్స్ కొట్టారు. ఎఫ్ఐహెచ్ ర్యాంకింగ్స్‌లో భారత్ 9వ స్థానంలో, థాయిలాండ్ 30వ స్థానాల్లో ఉన్నాయి. తొలి రెండు క్వార్టర్‌లు ముగిసేసరికి భారత్ 5–0 ఆధిక్యతలో నిలిచింది. మొత్తం 8జట్ల మధ్య జరిగే ఈ టోర్నీలో ప్రతి గ్రూప్‌లో టాప్–2 స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్–4లో ఆడనున్నాయి. అనంతరం టాప్–2 ఉన్న జట్ల మధ్య సెప్టెంబర్ 14న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. వెటరన్ గోల్ కీపర్ సవిత పూనియా, డ్రగ్ ఫ్లికర్ దీపిక లేకుండానే ఈ టోర్నీ బరిలో భారత్ ప్రాతినిధ్యం వహిస్తోంది. టోర్నీ విజేతగా నిలిచిన జట్టు నెదర్లాండ్స్–బెల్జియం వేదికగా జరిగే 2026 మహిళల ప్రపంచకప్‌కు అర్హత సాధించనుంది. శనివారం రెండో లీగ్ మ్యాచ్‌లో భారతజట్టు జపాన్, 8న సింగపూర్‌తో తలపడనుంది.



Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073